# రాష్ట్రంలో బిటి పత్తి సాగుకు
# యువత ఉత్సాహం




న్యూఢిల్లీ: భారతదేశంలో వ్యవసాయానికి యువత దూరమవుతున్నదన్న అభిప్రాయాన్ని చెరిపివేస్తూ నేటి యువత బిటి పత్తి సాగుకు మొగ్గు చూపుతోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో బిటి పత్తిని సాగు చేస్తున్న రైతుల్లో 50 శాతం మంది 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులే కావడం ఇందుకు నిదర్శనం. ఇండియన్ సొసైటీ ఫర్ కాటన్ ఇంప్రూవ్‌మెంట్ (ఐఎస్‌సిఐ) ఇటీవల ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్‌ల్లో చేసిన సర్వేలో ఈ ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. గత ఎనిమిది–తొమ్మిది ఏళ్ల కాలం నుంచి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో, 6–7 ఏళ్ల నుంచి పంజాబ్‌లో ఈ ధోరణి కొనసాగుతున్నట్టు ఐఎస్‌సిఐ వెల్లడించింది. దేశంలో బిటి పత్తిని సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపింది. వర్షాధారిత, ఇరిగేటెడ్, సెమీ ఇరిగేటెడ్ పద్ధతుల ద్వారా పత్తిని సాగు చేస్తున్న మొత్తం విస్తీర్ణంలో బిటి వంగడాల వాటా 95 శాతం ఉందని వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్‌లో సర్వేలో పాల్గొన్న వారిలో 50 శాతం రైతుల వయసు 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపులోనే ఉంది. ఈ మూడు రాష్ట్రాల్లో కలిపి 2,400 మంది రైతులను ఈ సర్వే సందర్భంగా ప్రశ్నించారు. సర్వేలో పాల్గొన్న రైతుల సగటు వయసు 42 సంవత్సరాలుగా ఉంది. విత్తనాల కంపెనీ మహికో స్వర్ణోత్సవాల సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ ఐసిఎస్‌ఐ నివేదికను ఆదివారం మహారాష్ట్రలో విడుదల చేశారు. జాతీయ స్థాయిలో బిటి పత్తి రైతులు ఒక్కో హెక్టారుపై సగటున అందుకున్న నికర లాభం 41,837 రూపాయలుగా ఉంది. ఇందులో అధికంగా పంజాబ్ రైతులు ఒక్కో హెక్టారుపై 53,139 రూపాయలు, ఆంధ్రప్రదేశ్ రైతులు 39,786 రూపాయలు లాభం పొందారు. మహారాష్ట్ర రైతులు 32,885 రూపాయల రాబడిని గడించారు. అదే సమయంలో కీటక సంహారక మందులు కొనుగోళ్ల మహారాష్ట్రలో 78 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 82 శాతం, పంజాబ్ 98 శాతం మేర తగ్గాయి.